# "మళ్ళీ మీరు పెళ్ళిచేసుకోకండి!"

సూర్యుడు మూడుబార్ల పైకి ఎక్కేసరికి అసిస్టెంటు ఇంజనీరు అన్నారావు ఆఫీసు గదిలోకి ప్రవేశించాడు టిఫెన్, కాఫీ ముగించుకొని. అప్పటికే జె. యీ., సూపర్‌వైజరూ, ఓవర్సీరూ, ఆజీలుగా వున్నారు. మర్యాదగా ఒక్కసారి లేచి కూర్చున్నారు. ఏ ఉపోద్ఘాతం లేకుండానే సూపర్‌వైజరు ఎస్టిమేట్సు తాలూకు కాయితాలు, బ్లూ ప్రింట్లు ముందు పెట్టాడు.

కొన్నిక్షణాలు నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దాన్ని హత్యచేస్తూ గోడమీదున్న గడియారం తొమ్మిదిసార్లు పలికింది.

అసిస్టెంటు ఇంజనీరు అన్నారావు వంచిన మొహం ఎత్తకుండానే కాగితాల్ని తీవ్రంగా పరిశీలిస్తున్నాడు. సూపర్‌వైజరు యింజనీరుగారి మొఖంకేసిపరీక్షగాచూస్తూ. ఆ ముఖంలో క్షణక్షణానికి కదిలేమార్పులకు అర్థాన్ని వెతుక్కుంటున్నాడు. జె. యి. గోడమీదున్న శకుంతల క్యాలండర్ కేసి అపేక్షగా చూస్తున్నాడు. ఓవర్సీరు కిటికీలోంచి బయట గార్డెన్ లోని పూల మొక్కలవంక పరధ్యానంగా చూస్తున్నాడు.

ఉండీ ఉండీ తుపాకి పేల్చబడ్డట్టు చివుక్కున మొహం పైకెత్తాడు అన్నారావు.

ఇంటిలో భార్య వాంతి చేసుకుంటున్న శబ్దం. ఒక్క నిముషంపాటు అల్లాగే యెత్తినతల యెత్తినట్టుగానే వుంచి విన్నాడు. నిజంగానే భార్య వాంతి చేసుకుంటూన్నది. ఆగదిలోవున్నముగ్గురూ ఆ శబ్దాన్ని స్పష్టంగా

విన్నారు. వాకిటిముందున్న జవాను రాములు ఇంటిలోకి వెళ్ళాడు అదుర్దాగా.

ఆశ్చర్యంతో జేవురించిన అన్నారావు మొహం క్షణంలో సగం సేపటిలోనే నల్లగా నేరేడుపండువలె మారిపోయింది. చేతుల్లోని కాగితాలు జారి టేబుల్ పైన పడిపోయాయి. కనురెప్పలు కదులాడని చూపులతో, అట్లాగే లేచి యింటిలోకి వెళ్ళాడు.

భార్య సుజాత పెరటిలో రాతిగట్టుపై కూర్చుని వాంతిచేసుకుంటున్నది. జవాను రాములు నీళ్లచెంబుతో ప్రక్కన నిల్చున్నాడు.

వరండాలో నిలబడి, దిగాలుగా చూస్తున్నాడు అన్నారావు.

నీళ్లతో ముఖంకడుక్కొని, ఇంటిలోకి వస్తున్న భార్యకేసి విస్మయచకితుడై చూస్తూ -- "ఏం జరిగింది సుజా!" అన్నాడు అసిస్టెంటు యింజనీరు అన్నారావు.

సుజాత సిగ్గుతో మల్లెమొగ్గ ఐంది.

"ఇంకా మీకు అర్థంకాలేదా?" అన్నట్టు ఓరగా చూస్తూ ఇంటిలోకి నడిచింది.

ఆమె వెంటతానూ లోపలికి వెళ్లాడు అన్నారావు.

"ఏమిటే, అసలుసంగతి చెప్పు. ఎందుకు వాంతిచేసుకున్నావు?" తన క్రింది ఉద్యోగుల్ని సంజాయిషీ అడిగినంత కఠినంగా అన్నాడు అన్నారావు. భర్త కంఠంలోని కాఠిన్యతకు విస్తుపోయింది సుజాత. ముప్ఫైమూడేళ్ళ వయసుగల పురుషుడూ, మొదటి సంబంధానికి ఇద్దరుబిడ్డల తండ్రీ, — భార్య వాంతి చేసుకుని - సిగ్గు అభినయిస్తే ఆ మాత్రం అవగాహన చేసుకోలేడూ! సంతోషంతో గంతులేస్తూ, తనని కౌగలించుకొని, నీ కోర్కె ఏమిటి? అంటూ ముద్దులవర్షాన్ని కురిపించవలసిందిపోయి, — అట్లా మోటుగా ప్రవర్తిస్తాడేం?

"మీరు తండ్రికాబోతున్నారు!" అన్నది సుజాత నేరంచేస్తున్నంత నెమ్మదిగా.

ఆ! మూర్ఛవచ్చినంత పనైంది అన్నారావుకు. భూమ్యాకాశాలు యేకమైనాయా అన్నట్టు బుర్ర బొంగరంలా తిరిగింది.

"అసంభవం!" నువ్వు గర్భం ధరింటానికి వీలులేదు. మనస్సులో మనస్సు పొలికేక పెట్టింది.

భర్తలో హఠాత్తుగా ఏర్పడిన మార్పుకు ద్వితీయ కళత్రం సుజాత బెండువడిపోయింది.

ఆరోజు తన ప్రోగ్రాం కాన్సిల్ చేసుకున్నాడు అసిస్టెంటు యింజనీరు అన్నారావు. వర్కుస్పాటుకు తయారయి వచ్చిన జె. ఇ., ఓవర్సీరూ తమ తమ ఇళ్ళకు వెళ్లారు - చొక్కా కాలర్లు పైకెత్తుకుంటూ.

సూర్యుడు హఠాత్తుగా అదృశ్యమై పట్టపగలే చుక్కలు పొడిస్తే ఆశ్చర్యం! సముద్రాలన్నీ ఒకేసారి ఇంకిపోతే యింకా ఆశ్చర్యం! పర్వతాలు కదలివస్తే అంతకంటే ఆశ్చర్యం! భార్య గర్భవతికావడం ఆశ్చర్యంగానే కనపడింది అసిస్టెంటు యింజనీరు అన్నారావుకు.

ఆ వార్త విన్నదగ్గరనుంచీ అతనిబుర్ర "బ్లాకౌట్" అయిపోయింది. చీకట్లో గడుసు దెయ్యాలవలె ఆలోచనలు తిరుగాడసాగినయ్. క్షణం సేపు మనస్సు నిలబడలేక పోయింది. వెంటనే భార్యను గవర్నమెంటు హాస్పిటల్‌కు తీసికెళ్ళి, లేడీ డాక్టరుచేత పరీక్ష చేయించాడు. ఆవిడ చిరునవ్వును వృధాగా ఖర్చుచేస్తూ "మూడోమాసం. ఆరోగ్యం బాగానే వుంది" అన్నది.

ఒంటినిండా చీమలు బారులు తీర్చినట్లయింది. అసిస్టెంటు ఇంజనీరు అన్నారావు. మూడోమాసమా! ఎట్లాసంభవం? — వీళ్ళంతా తనని మూర్ఖుణ్ణి చేస్తున్నారా? అబద్ధాలతో అపహాస్యం చేస్తున్నారా? ప్రకృతే ఎదురు తిరిగిందా? మానవుని విజ్ఞానమూ, శాస్త్రమూ, నమ్మకాలూ కొరగాకుండా పోతున్నాయా!

భార్య మొహంకేసి చూడలేకపోయాడు అన్నారావు. నీరసంతో నీలుక్కుపోతూ ఇంటికి వచ్చాడు. అతని మొదటిభార్య ఆఖరిమాటలు మనస్సులో బాకుల్లా పొడుచుకు వచ్చాయి. "మళ్లీమీరు పెళ్లిచేసుకోకండి"

కానీ, తను మళ్లీ పెళ్ళి చేసుకున్నాడు. ఆమె అంతిమ కోరికను గౌరవించలేదు. ఛీ, ఛీ. ఎంత బుద్ధిహీనుడు! ఎంత ద్రోహి! ఎంతనీచుడు! ఆమె ఎంతో దూరదృష్టితో అన్నమాటలను, తన భవిష్యత్తును ఎంతో నిశితంగా అంచనా వేసిన ఆమె అభిప్రాయాన్ని, తను యెదుర్కోబోయే సమస్యను తను స్థూలంగా వూహించిన ఆమె వూహాపటిమను - తను నిర్లక్ష్యం చేశాడు. స్త్రీ హృదయమూ, మనస్సూ, ప్రవృత్తీ తెలుసు కనుకనే తనకా అమూల్యమయిన సలహాయిచ్చింది. కాని తను చదువుకున్న మూర్ఖుడు! మామూలు బలహీనతకు లోనై, మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. రెండో భార్యతోనైనా నిజాన్ని నిర్భయంగా చెప్పాడా? లేదు. అప్పటికీ ఆమె ముందు 'ఆ విషయం' అతి రహస్యంగా ఉండిపోయింది. ఏమైనా జరుగ రానిది జరిగింది. తను క్షమించలేదు. లోకం క్షమించదు. సుజాత కాలు జారింది. పాపానికి ఒడిగట్టింది. తనకీ తన వంశానికి నిప్పులాంటి సాంప్ర దాయానికీ, హోదాకీ గౌరవ ప్రతిష్ఠలకీ తీరని కళంకం తెచ్చింది. ఏం చేయాలి తను?

ఇద్దరు పిల్లలు పుట్టగానే తను ఫామిలీ ప్లానింగు అమలు జరిపే వుద్దేశ్యంతో ఆపరేషను చేయించుకున్నాడు - శాశ్వతంగా పిల్లలు పుట్టకుండా వుండేందుకు. ఆ విషయాన్ని పెళ్ళికి ముందుగా సుజాత తల్లిదండ్రులకు చెప్పకపోవటం తన నేరం కావచ్చు. పెళ్ళి తరువాత అయినా ఆమెకు చెప్పి వుండాల్సింది. అదీ తన తప్పు కావచ్చు. కానీ, ఆ నేరమూ తప్పూ- ఆమె చేసిన ద్రోహంముందు ఏపాటి?

అసిస్టెంటు యింజనీరు అన్నారావు ఆ రోజు ఆఫీసు గదిలోకి వెళ్ళ లేదు అన్నం ముందు కూర్చోలేదు. హృదయంలో అగ్నిపర్వతాలు భగ భగ మండుతూండగా, తెంపులేని ఆలోచనలతో తుక తుక వుడికి పోతున్నాడు. ప్రపంచమంతా అవినీతిమయంగా కనపడ జొచ్చింది.

తనకి నెల తప్పిందని తెలుసుకున్న దగ్గరనుంచీ భర్త ప్రవర్తనలోని నిర్లిప్తతకు సుజాత హతాసురాలైంది. ఏ విధంగానూ ఊహించలేక పోయింది. ఆమెకూడా భోజనం చెయ్యలేదు ఆ రోజు.

ఆరాత్రి అన్నారావు ఆమెను అడకత్తెరలో పెట్టాడు — నిజాన్ని ఆమె ముఖతా తెలుసుకునేందుకు. ఆమె కన్నీటిముద్దయై రెండు చేతులూ ఎత్తి దణ్ణంపెట్టి! "నేనేపాపమూ ఎరుగను" అన్నది.

ఆమె మాటల్ని నమ్మలేదు అన్నారావు. నానా దుర్భాషలాడాడు. ఆమె తండ్రినీ ..తల్లినీ, వంశాన్నీ, సాంప్రదాయాన్నీ తిట్టాడు. ఛీ, ఛీ, నీతిలేని జాతి అన్నాడు.

సుజాతకు ఆ రాత్రి కన్నీళ్ళతోనే వెళ్ళమారిపోయింది. ఆ రాత్రే కాదు, ఏడోమాసం వచ్చి పుట్టింటికి వెళ్ళేవరకూ ఆమె బ్రతుకు కన్నీటి కెరటాల్లోనే దొర్లింది. ఆమెను ఎన్నివిధాల హింసించాలో అన్నివిధాలా హింసించాడు. ఎట్లాంటి మానసిక వ్యథకు గురిచెయ్యాలో, అట్లాంటి మానసిక వ్యథకు గురిచేశాడు. ఆమె అన్నింటిని భరించింది - భగవంతునిపై భారంవేసి.

* * *

తొమ్మిదవ మాసం చివరలో సుజాత ప్రసవించింది. మగ శిశువును కన్నది. తల్లీ, పిల్లవాడూ కులాసాగా వున్నారని మామగారి దగ్గరనుంచి టెలిగ్రాం వచ్చింది. ఆ టెలిగ్రాంను అసిస్టెంటు ఇంజనీరు కసిగా చించివేశాడు. అతనిలో అశాంతి, ద్వేషమూ, ఆగ్రహమూ మిన్ను ముడుతున్నాయి.

ఏం తోచక ఆరోజు సాయంకాలం క్లబ్బుకు వెళ్ళాడు అన్నారావు. ఎవరో నలుగురు క్యారమ్సు ఆడుతుంటే ప్రక్కన కుర్చీలో కూర్చున్నాడు. వాళ్లు చర్చించే విషయం అతని చెవులదాకా ప్రాకింది. ఆసక్తిగా వినసాగాడు.

"తిమ్మాజీ రావు మళ్ళీ ఆపరేషన్ చేయించుకున్నాడట. వారం రోజులు సెలవుపెట్టాడు"

"ఏం ఆపరేషను ?"

"పిల్లలు పుట్టకుండా".

"అదేమిటి ?" 'మళ్ళీ' అంటున్నావు. ఇదివరకు ఓసారి చేయించుకున్నాడా ?"

"ఆఁ! అంతకుముందు ముగ్గురూ, అది చేయించుకున్న తరవాత మళ్లీ ఇద్దరూ !'

"ఏమిటోయ్! వింతగా చెబుతున్నావు ? చేయించుకుంటే మళ్ళీ ఎట్లా పుట్టారు ?"

"మొదటి ఆపరేషన్ ఫెయిల్ అయిందని డాక్టరే ఒప్పుకున్నాడు."

అసిస్టెంటు ఇంజనీరు అన్నారావు బుర్రలో మెరపు మెరసి ఉరుము వురిమినట్లయింది. అట్లా జరిగే అవకాశం వుంటుందని అతనికెప్పుడూ తట్ట లేదు. తన విషయంలోకూడా అట్లా - ఎందుకు జరిగి ఉండరాదు. పాపం! సుజాతను అనుమానించి, నానా రకాలుగా హింసించాడు. క్లబ్బునుంచి ఇంటికి వచ్చి రాత్రంతా ఆలోచించాడు అన్నారావు.

రెండు రోజులు సెలవుపెట్టి మరునాడే విజయవాడ డాక్టరు దగ్గరకు వెళ్ళాడు. తన ఆపరేషన్ ఫెయిల్ అయిందో లేదో తేల్చుకోడానికి. డాక్టరుగారితో జరిగిన విషయం చెప్పాడు. డాక్టరు కనుబొమలు పైకి ఎగురవేసి 'అసంభవం' అని మనస్సులో అనుకొని ధర్మారావును పరీక్ష చేశాడు. మెల్లగా పెదవివిరచి, మళ్ళీ ముఖాన్ని గంభీరంగామార్చి "నేను ఆపరేషన్ చేస్తే ఫెయిల్ అవటమంటూ జరుగదు. ఇప్పటికి ఎన్నో వందల మందికి చేశాను. ఎవ్వరికీ ఫెయిల్ కాలేదు. ప్రాక్టీసులో అలాంటి మచ్చ వస్తే మేం బోర్డు త్రిప్పుకోవలసిందే!" అన్నాడు డాక్టరు.

అప్రతిభుడైనాడు - అసిస్టెంటు ఇంజనీరు అన్నారావు. మూడు నిమిషాల తరువాత తేరుకొని, హాస్పిటల్ బయటికి నడిచాడు. నిజమే! సర్జరీలో మంచి పేరున్నదాయనకు. ఆయన ఆపరేషన్ చేస్తే - ఫెయిల్ కావటమంటూ జరుగుతుందా, తన భ్రమతప్ప!

ఇంటికి రావటానికి రైల్లో కూర్చున్న అన్నారావుకు మొదటి భార్య ఆఖరిమాటలు జ్ఞాపకానికి వచ్చాయి. "మళ్ళీ మీరు పెళ్ళిచేసుకోకండి" నిజంగా తను పెళ్ళిచేసుకోకుండా ఉండవలసింది. ఈ సమస్యలూ, అంత

ర్వేదనా, గౌరవభంగమూ - ఉండేవికావుగా! ఏమైనా సుజాత గాడి తప్పి ప్రవర్తించింది. డాక్టరుకూడా నిర్ధారించాడు. ఆమెచేసిన పాపం తేలి పోయింది. ఇక తన కర్తవ్యమే మిగిలివుంది. ఏం చేయాలి? ఆమెను క్షమించి, ఆ పిల్లవాణ్ణి తన కొడుకుగానే భావించి - భావించడం కలలో కూడా జరుగని పని. నీతికీ, నిజాయితీకీ, ఆత్మగౌరవానికీ తను పదహారణాల మనిషి. మరేం చేయాలి?

సాయంత్రానికి యింటికి వచ్చాడు అన్నారావు. మామగారి దగ్గర్నుంచి లేఖ - వొచ్చి అబ్బాయిని చూచి వెళ్ళమని అర్థిస్తూ. ఆ లేఖను చింపివేశాడు. కంపరమెత్తినట్లు గదిలో పచార్లుచేశాడు.

పిల్లవాణ్ణి చూడటానికి అసిస్టెంటు యింజనీరు అన్నారావు మామగారింటికి వెళ్ళలేదు. పట్టుదలకు పది సంవత్సరాల ముందు పుట్టిన మనిషి. కనీసం ఉత్తరంకూడా వ్రాయలేదు - పిల్లవాడు ఎట్లా ఉన్నాడనీ, తల్లి ఆరోగ్యం యెట్లా వుందనీ.

మూడోమాసం ప్రవేశించగానే తండ్రిని వెంటబెట్టుకొని సుజాత వచ్చింది పిల్లవానితో. మూడు రోజుల వరకూ ఉయ్యాలలో వున్న పిల్లవాడ్ని చూడలేదు అన్నారావు. ఒకరోజు సాయంత్రం సుజాత పెరట్లో వుండగా - పిల్లవానికి యెవరిపోలికలో అన్నట్లు కుతూహలంగా చూశాడు.

భర్త వుయ్యాల మంచం దగ్గరుండి పిల్లవాడ్ని చూడటాన్ని అప్పుడే ఇంట్లోకి వస్తోన్న సుజాత చూసింది. ఆమె ముఖం వికసించింది.

"అచ్చు మీ పోలికే" అన్నది దగ్గరకు వస్తూ.

అన్నారావు ముఖం కందగడ్డ అయింది. అసంభవం! వాడికి తన పోలిక లెట్లావస్తాయి? వాడు తనకు పుట్టినవాడు కాదు. వాడికి తన పోలికలేమీ లేవు. రంగూ, ముఖమూ, ముక్కూ, గడ్డమూ, కళ్ళూ — ఏవీ తనవి కావు. అక్కడనుంచి విసురుగా ఆఫీసు గదిలోకి వెళ్ళాడు అన్నారావు.

* * *

ఏదో పీడకలవచ్చి, పేగు మడతపడినట్టుగా వులిక్కిపడి లేచింది. సుజాత తెల్లవారుఝామున మంచంమీదనుంచి. ప్రక్కన వుయ్యాలలో పిల్లవాడు లేడు.

కెవ్వున కేక వేసింది.

పిచ్చెత్తినట్లు ఇల్లంతా తిరిగింది సుజాత. పడకగది మంచంమీద భర్త కూడా లేడు. ఇంటిముందు గార్డెనులోకి వెళ్ళింది. సంపెంగ చెట్టుచాటున ఓ గోతిని పూడుస్తున్నాడు భర్త. అతని చేతిలో పార వున్నది.

సుజాతకు అయోమయంగా ఉంది.

"ఉయ్యాలలో పిల్లవాడు కనబడ్డం లేదండీ!" ఆదుర్దాతో నిండిన గొంతుకతో అన్నది సుజాత.

వికటాట్టహాసం చేశాడు అసిస్టెంటు ఇంజనీరు అన్నారావు.

"అక్కడెందుకుంటాడు! ఇదిగో - ఈ గోతిలో శాశ్వతంగా నిద్ర పోతున్నాడు."

"ఆ!" మూర్ఛపోయింది సుజాత.

తెల్లవారాక గాని ఆమెకు స్పృహరాలేదు. అప్పట్నుంచీ గుండె పగిలే దుఃఖంతో ఏడుస్తూ కూర్చుంది. అన్నారావు ఆమెను ఓదార్చలేదు. పైపెచ్చు తన పైశాచిక కృత్యాన్ని సమర్థించుకునేందుకు ప్రయత్నించ సాగాడు.

"అవును నేను హంతకుడ్నే. అసలుహంతకుడిగా, మార్చింది ఎవరు? నీ అవినీతి. నువ్వుచేసిన పాపం! ఆ పాపఫలాన్ని నేనెట్లా జీవితాంతం భరించేది? కనుక ఆదిలోనే త్రుంచివేశాను. నేను చేసింది దారుణకృత్యం కావచ్చు; ఘోరపాపం కావచ్చు; కసాయివాడి నేరం కావచ్చు. అందుకు భగవంతుడు విధించే శిక్షను స్వీకరించుటకు ఆజీలుగా వున్నాను."

ఆరోజు పోస్టులో వచ్చిన ఒక లేఖను చూచి అసిస్టెంటు యింజనీరు అన్నారావు తలక్రిందు లయినాడు.

"అన్నారావుగారికి—

'నిజాన్ని శాశ్వతంగా కప్పిపుచ్చలేరు' అంటారు. తాత్కాలిక ప్రయోజనాల నిమిత్తం మానవుడు సత్యాన్ని బంధించాలని చూసినా, ఏదో ఒక సమయంలో ఆ సత్యాన్ని భగవంతుడు వెళ్ళ గక్కిస్తాడు. మీ గురించి వున్న సత్యాన్ని భగవంతుడే విధిచిత్రంవల్ల ఈ క్షణంలో నా నుంచి వెళ్ళగ్రక్కిస్తున్నాడు. మీకు గతంలో నేను పిల్లలు పుట్టకుండా చేసిన ఆపరేషను ఫెయిల్ అయింది. ఆ మధ్య మిమ్మల్ని మళ్లీ పరీక్ష చేస్తూ ఆ విషయాన్ని గుర్తించి చాలా బాధపడ్డాను. కాని పైకి పరువు కోసం పేరు నిలబెట్టుకోవడం కోసం గంభీరంగా ఆ రహస్యాన్ని వెల్లడి చేయలేదు. కాని తర్వాత ఆలోచించు కొన్నకొద్దీ, నేను దాచిన రహస్యం మీ కుటుంబంలో ఎట్లాంటి అఘాయిత్యాలకు దారి తీస్తుందోనని తీవ్రంగా బాధపడుతూ వచ్చాను. డాక్టరుగా నావిధి నిర్వహణలో గొప్ప నేరమే చేశాను. నేను చేసిన నేరానికి భగవంతుడే నాకు శిక్ష విధించాడు. వారం రోజుల క్రితం ఒక కారు యాక్సిడెంటుకు గురి అయ్యాను. బలమైన గాయాలు తగిలాయి. ఒక కాలుకూడా తీసివేయాల్సిన దుస్థితి యేర్పడింది. పశ్చాత్తాప హృదయుడనై - ఈ విధంగా క్షమాభిక్ష వేడుకుంటున్నాను.

—డాక్టరు కేశవమూర్తి"

(సంస్కృతి)

—o—